ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
మంగళవారం 20 ఫిబ్రవరి 2024


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి సీతక్క, కలెక్టర్

మహా జాతరకు పటిష్ట ఏర్పాట్లు

గిరిజన కుంభమేళాను వైభవంగా జరుపుతాం

- రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మంత్రి సీతక్కతో కలిసి మేడారంలో పర్యటన
- మీడియా సెంటర్, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం
- జాతర నిర్వహణపై అధికారులతో సమీక్ష

మేడారం, ఫిబ్రవరి 19 : రెండేళ్లకోసారి జరిగే గిరిజన కుంభమేళా.. మేడారం మహాజాతరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, బుధవారం నుంచి జరిగే ఈ జాతరను వైభవంగా జరుపు తామని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి సోమవారం ఆయన మేడారంలో పర్యటించి.. గద్దెల పరిసరాల్లోని తాత్కా లిక విడిది గదిలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. సమ్మక్క సారలమ్మల దీవెల నలతో రాష్ట్రంలో అధికార మార్పు జరిగిందని, ప్రజల కోరుకున్న ప్రభుత్వం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మేడారం మహాజాతర ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు సుమారు 50 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను ముం దస్తుగా దర్శించుకున్నారని, జాతర రోజుల్లో 2కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారంద రికీ ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఓ వైపు అసెంబ్లీ నడుస్తున్నా సీతక్క ని త్యం జాతర పనులను పర్యవేక్షిస్తూ ఏర్పాట్లు చేయిస్తు న్నారని కొనియాడారు. గత ప్రభుత్వం మేడారం జాతరకు రూ.75కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తే.. ప్రస్తుతం ఖజానా ఖాళీగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రూ.110కోట్లు మంజూరు చేసిందన్నారు. మహాజాతరకు మరో రెండు కోట్ల మంది భక్తులు తర లివస్తారన్నారు. గత జాతరలో భక్తుల కోసం 3వేల బస్సులను నడిపితే ఈసారి తమ ప్రభుత్వం మహిళ లకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూనే 6వేల బస్సులను నడుపుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్ప టి వరకు 17కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. మహా జాతరలో 16 వేల మంది అధికారులు విధులు నిర్వ ర్తిస్తున్నారని, నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికు లను నియమించామన్నారు. గత జాతరల అను భవం కలిగిన ఐదు గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారు లను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్టు వివరించారు. జాతరకు అనుసంధానమయ్యే సుమా రు 270కిలోమీటర్ల రోడ్లు నూతనంగా

మిగతా 7వ పేజీలో..


వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి సీతక్క

ఖర్చుల లెక్కలు ప్రజల ముందుంచుతాం..

- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

మేడారం మహాజాతరకు భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేసిన నిధుల లెక్కలను ప్రజల ముందు ఉంచు తామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నా రు. జాతర పూర్తయిన వెంటనే ఖర్చు లన్నీ వెల్లడిస్తామని, మిగులు డబ్బు లతో శాశ్వత ఏర్పాట్లు చేపడతామన్నా రు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నా మని, ఇప్పటికే పెద్ద ఎత్తున భక్తులు మేడరం తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారన్నా రు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉంటూ నిరంతరం జాతర అభివృద్ధి పనులపై సలహాలు, సూచనలు చేస్తూ సహక రించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు రెండు నెలల నుంచి నిరం తరం విధుల్లో ఉండి భక్తుల సౌకర్యాల కల్పనలతో నిమగ్నమయ్యారని, జాతరకొచ్చే భక్తులు, వీఐపీలు.. అధికా రులు, పోలీసులకు సహకరించాలని కోరారు. 1996లో సమ్మక్క సారలమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ పండుగగా గుర్తించా లని కోరారు. మేడారం మహాజాతర నిర్వహణకు సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరికీ ధన్యవా దాలు తెలిపారు. ఈ పర్యటనలో మం త్రుల వెంట ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పలుశాఖల అధికారులు తదితరులున్నారు.


జంపన్నవాగు వొడ్డున ఉన్న జంపన్నగద్దె

సంపెంగ.. జనగంగ..

- జంపన్న రక్తతర్పణంతో మారిన సంపెంగ వాగు పేరు
- లక్షలాది మంది భక్తుల పుణ్యస్నానాలతో పులకరింత
- జోడు వంతెనలతో కుంభమేళాను మరిపించే జంపన్నవాగు
- నేడు గద్దెపైకి చేరుకోనున్న జంపన్న

7


వనదేవతలకు మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

భక్తజన మేడారం..

వనదేవతల దర్శనానికి తరలివస్తున్న లక్షలాది భక్తులు

మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలొచ్చారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వనదేవతలను దర్శించు కోవడంతో గద్దెల పరిస రాలు రద్దీగా మారాయి. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో గద్దెల గేట్లను మూసివేసి బయట నుంచే దర్శనానికి అవకాశ మిచ్చారు. వృద్ధులు, మహిళలు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి. మరోవైపు పుణ్యస్నానాలు ఆచరించే భక్తులతో జంపన్నవాగు తీరం కళకళలాడింది.

- మేడారం

7


తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

చల్లని తల్లుల అగ్రంపహాడ్

- భక్తి శ్రద్ధలతో కొలిస్తే అనుగ్రహించే సమ్మక్క సారలమ్మ
- ఎత్తు బంగారం, పిల్లాపాపలతో తరలివస్తున్న భక్తులు

7

లక్ష్యానికి చేరువలో..

- పన్నుల వసూళ్లలో వ్యవసాయ మార్కెట్లు ముందంజ
- రూ.438.58కోట్లకు గాను రూ.311.62కోట్ల వసూలు
- జనవరి నెలాఖరుకే 71శాతానికి చేరిక
- నూటికి నూరు శాతం లక్ష్యం చేరేలా ఉన్నతాధికారుల హుకుం
- చతికిల పడిన కొన్ని మార్కెట్లు



వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు, 110 వ్యవసాయ మార్కెట్లు పన్ను వసూళ్లలో లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. 2023 ఎప్రిల్ నుంచి 2024 జనవరి 31 వరకు 71 శాతం లక్ష్యాన్ని సాధించి విజయకేతనం ఎగరవేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. రీజియన్ పరిధిలో 2022- 2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.311.38 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-2024 ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.438.58కోట్లు పన్ను రూపేణ వసూలు చేయాలని నిర్ణయించగా జనవరి 31 వరకే రూ.311.62కోట్ల ఆదాయాన్ని ఆర్జించి 71 శాతం లక్ష్యాన్ని సాధించింది. ఇక ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు మిగతా 29శాతం పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరి నూటికి నూరు మార్కులు కొట్టేయాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు, డీఎంవోలు వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించి కార్యదర్శులకు ఆదేశాలు, సూచనలు, సలహాలను ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు భూపాల్‌పల్లి చిట్యాల మార్కెట్ పన్ను వసూళ్లలో 102 శాతం వసూలు చేసి ముందంజలో ఉంది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని 18 వ్యవసాయ మార్కెట్ల పనితీరును పరిశీలిస్తే..

- వరంగల్ జిల్లాలోని ఏనుమాముల మార్కెట్‌కు రూ.42కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే రూ.29.50కోట్లు వసూలు చేసి 70శాతం లక్ష్యాన్ని చేరింది. నర్సంపేట మార్కెట్‌కు రూ.6.62కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.2.42కోట్లు వసూలు చేసి 37 శాతం లక్ష్యాన్ని చేరింది. నెక్కొండ మార్కెట్‌కు రూ.1.40కోట్లకు గాను రూ.73లక్షలు వసూలు చేసి 52శాతం లక్ష్యాన్ని చేరింది. వర్ధన్నపేట మార్కెట్‌కు రూ.2.25కోట్లకు గాను కేవలం రూ.32లక్షలు వసూలు చేసి 14 శాతానికి పడిపోయింది.
- హనుమకొండ జిల్లాలోని పరకాల మార్కెట్‌కు రూ.2.60కోట్లకు గాను రూ.కోటి16 లక్షలు వసూ లు చేసి 45శాతం లక్ష్యాన్ని చేరింది. ఆత్మకూర్ రూ.కోటి14 లక్షలకు గాను రూ.35లక్షలు వసూలు చేసి 30 శాతం లక్ష్యాన్ని చేరింది.
- జనగామ జిల్లాలో జనగామ మార్కెట్ రూ.5.87 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.2.53 కోట్లు వసూలు చేసింది. ఘన్‌పూర్ రూ.2.57 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి48 లక్షలు వసూలు చేసింది. కొడకండ్ల రూ.కోటి88 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.కోటి 64లక్షలు వసూలు చేసింది. పాలకుర్తి రూ.82ల క్షలకు గాను రూ.15లక్షలు వసూలు చేసింది.
- మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ మార్కెట్ రూ.6.88కోట్లు గాను రూ.5.95కోట్లు వసూలయ్యాయి. కేసముద్రం మార్కెట్ రూ.6.20కోట్లకు గాను రూ.5.47కోట్లు వసూలు చేసింది. తొర్రూరు మార్కెట్ రూ.3.96కోట్లకు గాను రూ.2.85కోట్లు వసూలు చేసింది.
- భూపాలపల్లి జిల్లాలో కాటారం మార్కెట్ రూ.2.83కోట్లు గాను రూ.కోటి34లక్షలు వసూలు చేసింది. చిట్యాల మార్కెట్ రూ.కోటి వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తి చేసి ముందంజలో ఉంది. భూపాలపల్లి మార్కెట్ రూ.3.15కోట్లకు గాను రూ.కోటి68లక్షలు వసూలు చేసింది. ములుగు జిల్లాలో ములుగు మార్కెట్ రూ.6.48కోట్లకు గాను రూ.4.55కోట్లు వసూలు చేసింది.

2023 -2024 జనవరి 31 వరకు వరంగల్ రీజియన్ పరిధిలోని 19 జిల్లాలు 110 మార్కెట్‌లు కలిపి రూ. 438.58 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటికి రూ.311.62కోట్లు వసూలు చేసి 71శాతం లక్ష్యాన్ని చేరింది. మిగిలిన రెండు నెలల్లో వందకు వందశాతం లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

పన్ను వసూళ్లు ఇలా.. (రూ.కోట్లలో..)

జిల్లా	వసూలు చేయాల్సింది	వసూలు అయింది
వరంగల్	52.27	32.79
హనుమకొండ	3.74	1.51
జనగామ	11.14	5.82
మహబూబాబాద్	16.96	14.27
భూపాలపల్లి	6.98	4.40
ములుగు	6.48	4.54

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి

- మల్లేశం, వరంగల్ రీజియన్ జేడీ



ప్రభుత్వం, ఉన్నతాధికా రులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలి. కిందిస్థాయిలో ఉన్న అధికారులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలి. ఇది నిరంతరం శ్రమిస్తే వచ్చే ఫలితం. అందుకే రోజు మార్కెట్లను సందర్శిస్తూ అక్కడి సాధక బాధకాలను ఆలకిస్తుంటాం. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ మార్కెట్ ఫీజును వసూలు చేసేందుకు ప్రోత్సహిస్తాం. సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అది ఎక్కడ కనిపించకుండా పనిచేసుకుంటూ ముందుకు వెళ్లడం వల్ల పనులు సులభత రమవుతాయి. పన్ను వసూళ్లలో ముందజలో ఉన్న వారికి శాఖ తరుపున ప్రశంసపత్రాలు, అవార్డులు, అభినందనలుంటాయి.



వరంగల్ మేయర్‌పై అవిశ్వాసం?

- సొంతపార్టీ నేతలే రంగం సిద్ధం చేస్తున్నారంటూ ప్రచారం
- పార్టీలో ఉన్నా.. మారినా.. తగ్గేది లేదంటున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 19 : వరంగల్ మే యర్ గుండు సుధారాణిపై అవిశ్వాసానికి సొంత పార్టీ నేతలే సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆమె బీఆర్‌ఎస్‌లో ఉన్నా.. కాంగ్రెస్‌లో చేరినా తాము తగ్గే ది లేదన్నట్టుగా పావులు కదుపు తున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డితో రహస్య సమావేశాలు జరిపారన్న వార్త చక్కర్లు కొట్టింది. దీంతో ఈ పరిణామాలపై సోమ వారం 'ఆంధ్రజ్యోతి' పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డిని సంప్రదించింది. అందుకు స్పందించిన ఆయన.. 'అవును.. మా పార్టీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆమె మా పార్టీలో ఉన్నా.. కాంగ్రెస్‌లోని వెళ్లినా.. అవిశ్వాసం పెట్టడం ఖాయం. ఎన్నో కష్టాలకు ఓర్చి బీఆర్‌ఎస్ కార్యకర్తలు గుండు సుధారాణిని మేయర్ చేశారు. కానీ కాలనీ సమస్యలు కూడా పట్టించుకోకుండా కార్పొరేటర్లను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. ఆమె చేస్తున్న అవినీతిని బయట పెడతాం. ఇప్పటికే కార్పొరేటర్లతో రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. అందరి అభిప్రాయాలు తీసుకునే త్వరలో మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తాం. ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు తగ్గేది లేదు' అని స్పష్టం చేశారు. ఇప్పటికే మేయర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతోందని, ఆమె పార్టీ మారినా, మారకపోయినా అవిశ్వాస తీర్మానం పెట్టితారుమని బెతున్నారు. బీఆర్‌ఎస్‌కు మెజారిటీ కార్పొరేటర్లున్నారని, అవసరమైతే మేయర్‌ను వ్యతిరే కించే కార్పొరేటర్లను కూడాగడతామని ధర్మారెడ్డి స్పష్టం చేవారు. మేయర్‌పై అవిశ్వాసం విషయంలో ధర్మారెడ్డి వ్యాఖ్యలు బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలు సృష్టించేలా ఉండగా.. ధర్మారెడ్డితో కార్పొరేటర్ల మంతనాలు, జరుగుతున్న పరిణామాలపై బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



- సుమారు 80వేల బస్తాల వరకు అమ్మకానికి
- కళకళలాడిన మిర్చి యార్డులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. ఈ సీజన్‌లోనే ఎన్నడూలేని విధంగా సోమవారం సుమారు 80వేల బస్తాల అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌కు ఐదు రోజులపాటు వరుస సెలువులు రావడం, మరోపక్క సమ్మక్క, సారలమ్మ జాతరకు డబ్బుల అవసరం పడి తమ మిర్చి బస్తాలను అమ్మకానికి తీసుకువచ్చినట్లు రైతులు తెలిపారు. దీంతో మిర్చి యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శనమిచ్చాయి. కాగా, మార్కెట్‌కు ఐదు రకాల మిర్చి అమ్మకానికి వచ్చింది. తేజ రకం క్వింటాకు రూ.21వేయి, వండర్‌హాట్ రూ.21,500, యూఎస్.341 రూ.20,500, దీపిక రూ. 20వేలు, దేశీ రకం మిర్చి రూ. 38,500లు, మిర్చిలో తాలు క్వింటాకు రూ.8,500 చొప్పున ధర పలికింది.

పోలింగ్ శాతాన్ని పెంచాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 19: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతీవారం సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వర్గాల ఓటర్లను ఎన్నికల్లో భాగస్వాములు చేసి ఓటు వేయించడం, పట్టభద్రుల ఓటరు నమో దు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రెయి నీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ మహేం దర్‌జీ, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు ఎల్.రమే శ్, కె.శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి ఎం.హరి ప్రసాద్, తహసీల్దార్లు విజయ్ కుమార్, భాస్కర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, నాయబ్ తహసీల్దార్లు సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!


» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్టు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటురునాగారం ఐటీడీఏ పీవో సంతకం

పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎస్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏడో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ
» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యుటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యుటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర
» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.





మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు

పెరిగిన పత్తి ధర

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం పత్తి ధర అమాంతం పెరిగింది. క్వింటా రూ.7,010 చేరింది. గత రెండు నెలలుగా క్వింటా రూ.6,550 అటు ఇటుగా కొనసాగిన ధర సోమవారం రూ.7,010 చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉంటే కేవలం 1,200 పత్తి బస్తాలు మాత్రం సోమవారం అమ్మకానికి వచ్చాయి. పత్తి విక్రయాలు తగ్గినప్పుడు ధరలు పెరగడం సహజమేనని వ్యాపారులు చెబుతున్నారు.

రేపటినుంచి ఏనుమాముల మార్కెట్‌కు ఐదు రోజుల సెలవులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి క్యారం సంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురు, శుక్రవారాలు మేడారం జాతర, అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, హమాలీ, గుమస్తా కార్మికుల వినతి మేరకు సెలవులు, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి సోమవారం మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

టీడీపీ రాష్ట్ర నాయకుడు రఘుబాబు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 19: ఏపీలోని అనంతపురం జిల్లాలో జరిగిన వైసీపీ సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కొందరు పాశవికంగా దాడి చేశారని, అది హేయమైన చర్యని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకుడు, చంద్రబాబు యువసేన జాతీయ అధ్యక్షుడు చెన్నోజు రఘుబాబు అన్నారు. ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండనగా సోమవారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడికి ఏపీ సీఎం వైఎస్ జగన్ పూర్తి బాధ్యత వహించాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు తీసుకురావాలన్నారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు ఈ దాడిని ఖండించాలని కోరారు. నిరసనలో బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పంజాల రాజుగౌడ్, టీడీపీ వరంగల్ పార్లమెంట్ కార్యదర్శి హరిదాస్యం సురేష్‌కుమార్, కార్తీక్, కౌశిక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విశ్వఅబాకస్ పోటీలకు ఎంపిక

ఏకశిలానగర్, ఫిబ్రవరి 19 : కరీమాబాద్‌కు చెందిన సన్‌రైజ్ హై స్కూల్ విద్యార్థి పెండ్లి రిషిక్‌సాయి రాష్ట్ర స్థాయి విశ్వ అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కాజీపేటలోని బిషప్ బెరట్టం హై స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విశ్వ అబాకస్ పోటీల్లో సన్‌రైజ్ హై స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న బాలుడు రిషిక్‌సాయి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాశెట్టి వెంకటేశ్వర్లు,కరస్పాండెంట్ బాశెట్టి శారదలు సోమవారం రిషిక్ సాయిని అభినందించి సత్కరించారు. సాయి 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు.

3వ డివిజన్ సమస్యల్లో

● అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ ● పనిచేయని సీసీ కెమెరాలు ● అధ్వానంగా రోడ్లు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 19: నగర కేంద్రానికి అతి చేరువలో ఉన్న మూడో డివిజన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో విలీన గ్రామాల ప్రజలు సమస్యలతో సావాసం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని మూడో డివిజన్‌లో విలీన గ్రామాలైన పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట వాసులు పారిశుద్ధ్యం లోపం, వీధి దీపాలు వెలగడం లేదు. అధ్వానంగా ఉన్న డ్రైయినేజీలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్నప్పటికీ డివిజన్‌లో పారిశుధ్య సమస్య వెంటాడుతోంది. పైడిపెల్లి, ఆరెపల్లి గ్రామాల శివారులో పలువురు వ్యర్థాలు పడేస్తుండటంతో సమస్య జటిలమవుతోంది. మునిసిపల్ శానిటరీ కార్మికులు పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తూ వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికతోడు వీధి కుక్కలు, కోతుల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, అయినా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. సీసీ కెమెరాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

మూడో డివిజన్ పరిధిలోని విలీన గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైయినేజీలు సరిగా లేక అనేక చోట్ల మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో డివిజన్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీటితో దుర్వాసన వెదజల్లుతోందని, రాత్రులు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట గ్రామాలలో పలుచోట్ల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి.



పైడిపెల్లిలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు

వెలగని వీధి దీపాలు...

డివిజన్ పరిధిలోని విలీన గ్రామల్లో చోట్ల వీధి దీపాలు వెలుగక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరెపల్లి నుంచి పైడిపెల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో వీధిదీపాలు ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ వీధి దీపాలు వెలుగడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో విద్యుత్తు స్థంభం ఒక వైపుకు వంగి ప్రమాదకరంగా మారింది. ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

విలీన గ్రామాల సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. నగర కేంద్రానికి అతి సమీపంలో ఉన్న విలీన గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన వాటి పరిస్థితి ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..

జన్ను షిభారాణి, స్థానిక కార్పొరేటర్

డివిజన్‌లోని విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పలు చోట్ల పూర్తి చేశాం. స్మార్ట్ సిటీ కింద డివిజన్‌కు మంజూరైన రూ.మూడన్నర కోట్ల నిధులు ఎన్నికల అనంతరం నిలిపివేశారు. దీంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలియజేస్తున్నాం. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరితగతిన పరిష్కరిం చేందుకు కృషి చేస్తా.



పైడిపెల్లిలో పని చేయని సీసీ కెమెరాలు



అయ్యప్పటెంపుల్ సమీపంలో ప్రమాదకరంగా కరెంట్ పోల్

నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులు

» నగరంలో అధిక వడ్డీలు వసూలు
» అప్పు తీర్చకుంటే వేధింపులు..
» రుణం తీర్చలేక కుదేలవుతున్న ప్రజలు
» ఆత్మహత్యలకు దారితీస్తున్న ఆగడాలు



కరీమాబాద్, ఫిబ్రవరి 19: అప్పు ఏనాటికైనా ముప్పే అంటారు పెద్దలు. ఒకప్పుడు ఇల్లు కడితేనో, పెళ్లి చేస్తేనో అప్పులు చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే ఆదాయం అవసరాలకు సరిపోకపోవడం అప్పుల బాట పడుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. దినసరి కూలీలు, ఆటో కార్మికులు, చిరువ్యాపారులకు అప్పులు సహజంగా మారింది. ఇదే అదునుగా భావిస్తున్న వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక వడ్డీ వ్యాపారుల వేధింపులతో స్వరం కోల్పోతున్నారు.

కోట్లల్లో వడ్డీ వ్యాపారం..

వరంగల్ నగరంలో వడ్డీ వ్యాపారం కోట్లలో సాగుతోంది. రోజువారి కూలీలే కాకుండా చిరువ్యాపారాలు చేసేవారు, చిల్లర దుకాణా దారులు, ప్రైవేటు, ప్రభుత్వ చిరుద్యోగులు కూడా తమ అవసరాలకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు పెట్టుబడికి డెయిలీ ఫైనాన్స్ వారిని ఆశ్రయిస్తున్నారు. ఉదయం రూ.900 ఇస్తే సాయంత్రానికి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. అలాగే రూ.10వేలు కావాలంటే అందులోంచి ముందే రూ.వెయ్యి కట్ చేసుకొని 9వేలు ఇచ్చి, పదివారాల్లో 10 నుంచి 20శాతం వడ్డీతో రూ.10వేలు ఆపైన జమ చేసుకుంటున్నారు. మరి కొందరు వారం తపు చిటీల పేరుతో అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. మరికొందరు వంద రూపాయలకు రూ. 4నుంచి రూ. 5చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ. 10 వేల నుంచి రూ. 5లక్షలు ఆపైన వరకు కూడా వడ్డీ వ్యాపారులు అప్పులు ఇస్తూ వడ్డీల దందా నడిపిస్తున్నారు. ఈ లెక్కన వడ్డీ వ్యాపారులు సాగిస్తున్న వడ్డీల వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చిటీల మాటున వ్యాపారం...

నగరంలో చిట్టీల మాటున ఈ వడ్డీ వ్యాపారాలు జోరుగా సాగుతోంది. రామన్నపేట, రంగంపేట, కొత్త వాడ, పోచమ్మ మైదాన్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ, గిర్మాజీపేట, చింతల్, పుప్పాలగుట్ట, శివనగర్, ఖిలావరంగల్, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, సాకరాశికుంట, పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో తమ వ్యాపారాలను యథేశ్చగా నిర్వహిస్తున్నారు.

తనఖా పెట్టుకొని అప్పు..

అవసరాలకు అప్పుల కోసం వస్తున్న వారికి అప్పు ఇవ్వాలంటే అధిక వడ్డీ తీసుకోవడమే కాకుండా ముందు జాగ్రత్తగా వారి వద్ద ఉన్న విలువైన వస్తు వులను ఇళ్లు, స్థలాలు, భూములు, వాహనాలను, తన ఖా పెట్టుకుంటున్నారు. ముందు చెప్పినట్లుగానే సకా లంలో వడ్డీతో కలిపి అసలు చెల్లించాలని తీర్మానం చేయించుకుంటున్నారు. సకాలంలో అప్పు తీర్చకుంటే వడ్డీతో సహాలెక్కచేసి తనఖా పెట్టిన వస్తువులను, విలువైన పత్రాలను స్వాధీనం చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

దెబ్బతింటున్న మానవ సంబంధాలు

వడ్డీకి డబ్బులు తీసుకునే సమయంలో ఉంటున్న మానవ సంబంధాలు ఆ తరువాత కొనసాగడం లేదు. వడ్డీ సమయంలో పరస్పరం ఉన్న స్నేహ సంబంధం అప్పులు తీసుకున్న తదుపరి కొనసాగడం లేదు. వడ్డీ కట్టలేక అప్పు తీసుకున్న వ్యక్తి డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో కొన్ని సందర్భాల్లో గొడవలకు దారి తీస్తున్నాయి. అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు లేకపోలేదు.

అనుమతులు ఉండాలి...

వడ్డీ వ్యాపారం చేయడానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. వడ్డీ తీసుకునే వారిపై అధిక భారం పడకుండా, ఇబ్బందులు కలుగకుండా చట్టాల్ని రూపొందించింది. మనీ లెండింగ్ ఆక్ట్ ప్రకారం ప్రభుత్వ అనుమతి తీసుకుంటేనే వడ్డీ వ్యాపారం చేయాలి. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

నిర్ణీత చలాన చెల్లించి అనుమతు లు తీసుకోవాలి. రోజు వారి వసూళ్లు చేసే వ్యాపారు లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలి. వడ్డీ ఏడాదికి 14శాతం తీసుకోవాలి. ఎన్ని నెలల వడ్డీ ఇస్తారో దాని ప్రకారం విభజించుకోవాలి. ఏటా లెక్కలు రెవెన్యూ అధికారులు పరిశీలించాలి. దీనికి తోడు ఈ వ్యాపారానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. కాని జిల్లాలో కొందరు వ్యాపారులు అను మతులు తీసుకోకుండా తమ ఇష్టారీతిన దందా కొనసాగిస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న నర్సయ్య

నర్సయ్యకు ఐబీవో రాష్ట్ర స్థాయి అవార్డు

శంభునిపేట, ఫిబ్రవరి 19 : రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పంచకం నర్సయ్య రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ (ఐబీవో) స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాల్లో పనిచేసిన వారికి అవార్డులను అందజేసింది. బెస్ట్ కరస్పాండెంట్ విభాగంలో నర్సయ్య రాష్ట్రస్థాయి అవార్డు అందించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం రాత్రి నర్సయ్యకు మొమెంటో, అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐబీఓ సంస్థ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ, ఖమ్మం అర్బన్ సిటీ ఇన్ఫ్రాడెవలపర్ రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వెంకటరెడ్డి, కూసూరి శ్రీనివాస్, జోయల్ డేవిడ్‌లు, కావ్య, దివ్యస్వాతి, శ్వేత త్రిష, కిరణ్, సాత్విక్, పవన్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డ్రామా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 19: రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ డ్రామా పోటీలకు దేశాయిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శ్రేయ, వరుణ్, హర్షిత, వర్షణి, విశ్వాణి ఎంపికైనట్లు డ్రామా గైడ్, ఉపాధ్యాయుడు భూముల రాజేష్ తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా, పరిశోధన మండలి, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇంగ్లిష్ డ్రామా పోటీలలో తమ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. 26న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు వెల్లడిం చారు. కార్యక్రమంలో ఎల్టా బాధ్యుడు టి.వెంకటేశ్వర్‌రావు, పూల శ్రీనివాస్, సంపత్‌కుమార్, రవికుమార్, లక్ష్మణ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన జ్యోతికి సత్కారం

సంగెం, ఫిబ్రవరి 19: కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ కోసం వెళ్తున్న చిదురాల జ్యోతిని సంగెం పోలీస్ స్టేషన్‌లో సత్కరించారు. సోమవారం స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న జ్యోతి ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ కోసం వెళ్లారు. ఎస్సై భరత్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ విధుల్లో పక్షపాతం లేకుండా నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సీతారాములు, కానిస్టేబుళ్లు శంకర్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గీసుగొండ, ఫిబ్రవరి 19: మండలంలోని శాయంపేటహవేలిలో మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ కాయిత భిక్షపతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికర్‌బాబు, స్థానికులు జూల రమేష్, కనకయ్య పాల్గొన్నారు.

22 నుంచి నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

గీసుగొండ, ఫిబ్రవరి 19: మండలంలోని ఎలుకుర్తిహవేలిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఈనెల 22 నుంచి 25 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు పురుషోత్తమాచార్యులు తెలిపారు. 22, 23న అధ్యయనోత్సవాలు, 24 కల్యాణోత్సవం, 25న గ్రామశివారులోని నరసింహుల గుట్ట వరకు శోభయాత్ర నిర్వహించబడునని చెప్పారు. బ్రహ్మోత్సవాల కరప త్రాలను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



రంగశాయిపేటలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



ఓసిటీ జంక్షన్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రదీప్‌రావు



ఊకల్‌లో శివాజీ మహారాజ్ శోభాయాత్ర

శంభునిపేట, ఫిబ్రవరి 19 : దేశ భక్తికి నిదర్శనం ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఆరెకటిక సంఘం రాష్ట్ర నాయకులు అన్నారు. రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లో సోమవారం ఘనంగా శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యం కొరకు, సింహాసనం కొరకు యుద్ధాలు చేసే సమయంలో ధర్మం కొరకు, దేశం కొరకు పోరాడిన వీరుడన్నారు. కార్యక్రమాల్లో రావుల బాలరాజు, గోగికార్ రవీందర్, రావుల నవీన్, మహేష్, సురేష్, నర్సోజీ, గంగాధర్, అఖిల్, విరాట్, శివగణేష్, శివసాయి, గోగికార్ శ్రీకాంత్, నాగరాజు, నామ్‌తాబాద్ కిషన్, రవి, శివాజీ, అజయ్, టింగిలికార్ సురేష్ పాల్గొన్నారు.

» వరంగల్‌టౌన్: కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సతీష్‌కట్టర్, మడిపల్లి నాగరాజు, వంగరి రాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యువత ఛత్రపతి శివాజీ బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, పెరుమాండ్ల లక్ష్మణ్, వంగరి రవి, కొమాకుల నాగరాజు, కోట సతీష్, తిరుమల శ్రీనాథ్, అల్లి అజయ్, రాఘవచారి పాల్గొన్నారు. అలాగే, 21వ డివిజన్‌లో లోతుకుంటలో శివాజీ జయంతి వేడుకలు బీజేపీ నాయకులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అపురూప సాయిరాం, పోలెపాన నవీన్, రాజు, క్రిష్ణవేణి, రతన్ పాల్గొన్నారు.

» గీసుగొండ: ఊకల్, మరియపురం, పోతరాజుపల్లి వంచనగిరి, ఆరెపల్లి గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శోభయాత్ర చేపట్టారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, అడ్డాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 19 : రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో యాత్ర కోసం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కొండేటి శ్రీధర్

ఛత్రపతి శివాజీని
యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



శివాజీనగర్‌లోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

దుగ్గొండి, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ సామ్రాజ్యం కోసం నిరంతరంగా ఉద్యమించారని, ఆయన పోరాట పటిమను యువతస్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాదవ రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండలంలోని శివాజీనగర్‌లోని శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భక్తికోసం మరాఠా రాజ్యంకోసం ధైర్యంగా పోరాడిన మహా నేతని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఇంగోలి రాజేశ్వర్‌రావు, సుకినె నాగరాజు డొకిలె రాజేశ్వర్‌రావు, నగేష్, కర్ణాకర్, బుసారి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట : పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఆరె కుల సంక్షేమ సంఘం నర్సంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరెకుల సంక్షేమ సంఘం నాయకులు సాంబశివరావు, మలహల్ రావు, గోపాల్‌రావు, రాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో ఛత్రపతి శివాజీ 295వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు కౌడగాని రాజావీరు మాట్లాడుతూ శివాజీ పాలనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుజ్జుల బాబురావు, లక్ష్మణ్‌రావు, లడె రాజేశ్వర్‌రావు, లడే రాజీరు, రాజయ్య, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు మండలంలోని కొత్తపెల్లిలో సోమవారం ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కదం మహేందర్, ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, కమ్మగోని సుధాకర్, తాళ్లపెల్లి యాదగిరి, మోతాజీ, రమేష్, నాగుళ్లగాని నర్సింగరావు పాల్గొన్నారు.

● నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో ఆర్య క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రుద్రగూడెంలోని ప్రభుత్వ బడిలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. విద్యార్థులకు శివాజీ చరిత్రను వివరించి, శివాజీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లకిడే శివాజీ, అంబరకొండ రాజు, గందె శ్రీనివాస్‌గుప్తా, మామిండ్ల రాజిరెడ్డి, మాసంపెల్లి సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు కందుల గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులను అందుకుంటున్న గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 19 : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో నర్సంపేట పట్టణంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించినట్లు గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎస్.శివసాయి, ఎం.అక్షయ, ఎం.హర్షవర్ధన్, అఖిలేష్, సహస్ర, ఎం.డి.అదిబా, కె.స్వేచ్ఛలు బహుమతులు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, రాధ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

భక్తులను తరలించేందుకు సర్వం సిద్ధం

● నర్సంపేట నుంచి మేడారానికి ప్రారంభమైన ప్రత్యేక బస్సులు
● మూడు టికెట్ కౌంటర్లు, క్యూలైన్ కోసం బారికేడ్ల ఏర్పాటు



మేడారం బస్సుల టికెట్ల కోసం క్యూలో నిలుచున్న భక్తులు

నర్సంపేట, ఫిబ్రవరి 19 : ప్రతీ రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ తెలంగాణ కుంభమేళా మహా జాతర కోసం ప్రత్యేక బస్సులను నడిపించేందుకు నర్సంపేట ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ముందస్తు మొక్కుల కోసం ఒకటి రెండు బస్సులను ఏర్పాటు చేయడంతో ఇక్కడి నుంచి మేడారానికి భక్తులు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24వ తేది వరకు మహా జాతర జరుగనుంది. 21న సారలమ్మ దేవత, 22 సమ్మక్క దేవత గద్దెలకు రానున్నారు. 23న సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువుదీరనున్నారు. కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడానికి వేలాదిగా తరలివెళ్లనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నర్సంపేట నుంచి మేడారానికి బస్సులను నడవడానికి ఆర్టీసీ డిపో మేనేజర్, ఉద్యోగులు ఏర్పాటు చేశారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నర్సంపేట బస్టాండ్ ఆవరణలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 25వ తేది వరకు నిరంతరంగా భక్తులను మేడారం జాతరకు తరలించడానికి, మొక్కులు చెల్లించుకున్న వారిని తిరిగి తీసుకురావడానికి బస్సులను సిద్ధం చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా జాతరకు ఉచితంగా మహిళలను చేరవేయడానికి గత జాతర కంటే ప్రస్తుత జాతర కోసం బస్సుల సంఖ్యను పెంచారు.

నర్సంపేట నుంచి 245 బస్సులు

నర్సంపేట నుంచి మేడారం జాతరకు 245 బస్సులను నడిపిస్తున్నారు. స్థానిక డిపోకు చెందిన 45 బస్సులతో పాటు ఇతర డిపోల నుంచి 200 బస్సులను రప్పించి మేడారం జాతరకు నడిపిస్తున్నారు. నర్సంపేట నుంచి మేడారం జాతరకు పెద్దలకు రూ:250, పిల్లలకు రూ:150 చార్జీని నిర్ణయించారు. బస్టాండ్ ఆవరణలో జాతరకు వెళ్లేందు వచ్చే భక్తులు టికెట్లు తీసుకునేందుకు మూడు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఎండవేడిమి తగుల కుండా శామియానాలను ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్య ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉండి సేవలు అందించడానికి సిబ్బందిని కేటాయించారు. గత జాతర సమయంలో 135 బస్సుల ద్వారా 36 వేల మంది భక్తులను జాతరకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, ఈ జాతరకు 245 బస్సుల ద్వారా 55 నుంచి 60 వేల మంది భక్తులను చేరవేయాలని లక్ష్యంగా ఎంచుకున్నారు.

మేడారం జాతర బస్సులు ప్రారంభం



జాతర బస్సులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 19 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం నుంచి మేడారం మహా జాతరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఆర్టీసీ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తొర్రూరు డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలని భక్తులకు సూచించారు. మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం కొనసాగించవచ్చని తెలిపారు. పురుషులు మాత్రం తప్పనిసరిగా ఆర్టీసీ నిర్ధేశించిన ధరల ప్రకారం టికెట్ కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వల్ల సమ్మక్క-సారలమ్మ తల్లుల దర్శనం త్వరగా అవుతుందని, ఆ దిశగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి అమ్మవార్లను దర్శించుకోవాలని తొర్రూరు డిపో మేనేజర్ విశ్వనాథ్ కోరారు.

● భక్తులు అప్రమత్తంగా ఉండాలి

మేడారం జాతరకు వెళ్లే భక్తులకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు పలు సూచనలుచేశారు. చిన్న పిల్లలు, ఆభరణాలు వంటి విషయాలపై భక్తులు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ముసలయ్య కానిస్టేబుళ్లు రమేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తికి దేహశుద్ధి



దీక్షకుంటలో దేహశుద్ధి కాబడ్డ అపరిచిత వ్యక్తి

నెక్కొండ, ఫిబ్రవరి 19 : మండలంలోని దీక్షకుంటలో అపరిచిత వ్యక్తికి గ్రామస్థులు సోమవారం ఉదయం దేహశుద్ధి చేశారు. ఉదయం గ్రామంలో తిరుగుతున్న అపరిచిత వ్యక్తిని గుర్తించిన గ్రామస్థులు అతడిని వివరాలు ఆడిగినా చెప్పలేదు. దీంతో అనుమానంతో గ్రామంలోని విద్యుత్ స్తంభానికి తాళ్లతో కట్టి దేహశుద్ధి చేశారు. అయినా అతని వివరాలు తెలుపక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇటీవల గ్రామాల్లో చిన్న పిల్లలను ఎత్తుకెల్లే ముఠాలు తిరుగుతున్నాయంటూ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు అతని ప్రవర్తనపై అనుమానంతో అపరిచిత వ్యక్తిని బందించినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు వ్యక్తిని క్షున్నంగా తనిఖీ చేయగా అతని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. అతను బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతనికి మతిస్థిమితం సరిగా లేదని ఎస్సై షేక్ జాన్‌పాషా తెలిపారు. సాయంత్రం వరకూ అతని నడవడికను గమనించిన తరువాత పంపిస్తామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పాపం కేసీఆర్‌దే...

● ఎమ్మెల్యే నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, ఫిబ్రవరి 19 : కాళేశ్వరం ప్రాజెక్టు పాపం గత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. వేల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ప్రాజెక్టు ద్వారా వందల ఎకరాలకు కూడా సాగునీరు అందించలేదన్నారు. ఎనభై వేల పుస్తకాలు చదివి నిర్మించిన ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని, మేడిగడ్డ లాగే అన్నారం బ్యారేజీ సైతం పగుళ్లు ఏర్పడ్డాయని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చిద్దామంటే కేసీఆర్ కనీసం అసెంబ్లీకి కూడా రాలేదని మండిపడ్డారు. మేడిగడ్డ ఘటన బాధ్యులపై చట్టపరంగా చర్య తీసుకోవడానికి గాను తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎంపీటీసీ మహేంద్ర, నాయకులు రాంచందర్, రాఘవులు, లచ్చునాయక్, సావిత్రి, భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెరిగిన పత్తి ధర



ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి బస్తాలు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19 : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం పత్తి ధర అమాంతం పెరిగింది. క్వింటా రూ.7,010 చేరింది. గత రెండు నెలలుగా క్వింటా రూ.6,550 అటు ఇటుగా కొనసాగిన ధర సోమవారం రూ.7,010 చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉంటే కేవలం 1,200 పత్తి బస్తాలు మాత్రం సోమవారం అమ్మకానికి వచ్చాయి. పత్తి విక్రయాలు తగ్గినప్పుడు ధరలు పెరగడం సహజమేనని వ్యాపారులు చెబుతున్నారు.

రుద్రగూడెంలో దశాబ్ది బొడ్రాయి ఉత్సవం



బొడ్రాయి ఉత్సవాన్ని చేస్తున్న గ్రామ నాయకులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని రుద్రగూడెం గ్రామంలో సోమవారం దశాబ్ది బొడ్రాయి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రుద్రగూడెంలో బొడ్రాయిని ప్రతిష్ఠించి పది సంవత్సరాలు అవుతున్న తరుణంలో గ్రామ బొడ్రాయి వద్ద పూజారి శ్రీకాంత్ సమక్షంలో బొడ్రాయి, హనుమాన్ గుడి, పోచమ్మ గుడిలలో ప్రత్యేకంగా శుద్ధిచేశారు.అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో గ్రామ నాయకులు మల్లాడి సాంబరెడ్డి దంపతులు, గందె శ్రీనివాస్ గుప్తా దంపతులు, నూటెంకి సూరయ్య దంపతులు, మురాల మహేష్ దంపతులు, శివకోటి, మంద రాజిరెడ్డి, మంద లింగారెడ్డి, బేతి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

● బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్‌రెడ్డి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 19 : ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో పరిపాలన కొనసాగిస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తన కోటా కింద అందించాల్సిన నిత్యావసర సరుకులను పంపిణీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఇస్తున్న ఉచిత రేషన్ మాత్రమే ప్రజలకు పంపిణీ చేస్తుందన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ముందు ఆర్భాటంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయంగా పేద ప్రజలకు నెల నెలా ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వ ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తూ పేద ప్రజల కడుపు నింపాలన్నారు.

రేపటినుంచి మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 19: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి క్యారం సంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధ, గురు, శుక్రవారాలు మేడారం జాతర, అలాగే చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, హమాలీ, గుమస్తా కార్మికుల వినతి మేరకు సెలవులు, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి సోమవారం మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని ఆ ప్రకటనలో తెలిపారు.

నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులు

కరీమాబాద్, ఫిబ్రవరి 19: అప్పు ఏనాటికైనా ముప్పే అంటారు పెద్దలు. ఒకప్పుడు ఇల్లు కడితేనో, పెళ్లి చేస్తేనో అప్పులు చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే ఆదాయం అవసరాలకు సరిపోకపోవడం అప్పుల బాట పడుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. దినసరి కూలీలు, ఆటో కార్మికులు, చిరువ్యాపారులకు అప్పులు సహజంగా మారింది. ఇదే అదునుగా భావిస్తున్న వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు పెట్టుబడికి డెయిలీ ఫైనాన్స్ వారిని ఆశ్రయిస్తున్నారు. ఉదయం రూ.900 ఇస్తే సాయంత్రానికి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. అలాగే రూ.10వేలు కావాలంటే అందు లోంచి ముందే రూ.వెయ్యి కట్ చేసుకొని 9వేలు ఇచ్చి, పదివారాల్లో 10 నుంచి 20శాతం వడ్డీతో రూ.10వేలు ఆపైన జమ చేసుకుంటున్నారు. మరి కొందరు వారం తపు చిటీల పేరుతో అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. మరికొందరు వంద రూపాయలకు రూ. 4నుంచి రూ. 5చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ. 10 వేల నుంచి రూ. 5లక్షలు ఆపైన వరకు కూడా వడ్డీ వ్యాపారులు అప్పులు ఇస్తూ వడ్డీల దందా నడిపిస్తున్నారు. నగరంలో రామన్నపేట, రంగంపేట, కొత్త వాడ, పోచమ్మ మైదాన్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ, గిర్మాజీపేట, చింతల్, పుప్పాలగుట్ట, శివ నగర్, ఖిలావరంగల్, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, సాకరాశికుంట, పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో తమ వ్యాపారాలను యథేశ్చగా నిర్వహిస్తున్నారు.

మేడారానికి బైలెల్లిన గ్రామాలు



కట్ర్యాల నుంచి మేడారానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న ప్రజలు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 19 : మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరకు గ్రామాలు బయలుదేరి వెళ్తున్నాయి. తెలంగాణ కుంభమేళాగా పిలువబడుతున్న ఈ జాతర ఈ నెల 21 నుంచి 24వ తేది వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతరలో ప్రజలు అక్కడే ఉండి తల్లుల సేవలో తరిస్తారు. దీని కోసం అక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉండడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా పోలీసులు లోపలి వరకు వెళ్లేందుకు అనుమతించరు. దీని కారణంగా సోమవారం నుంచి వర్ధన్నపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ట్రాక్టర్లు, డీసీఎంలు, బొలేరో వాహనాల ద్వారా వారు ప్రతీ ఏటా సేద తీరే చోటుకు వెళ్లేందుకు పయనమైపోతున్నారు. చిలకలగుట్ట వద్ద ఎక్కువగా వర్ధన్నపేట మండలానికి చెందిన ప్రజలు డేరాలు వేసుకుని ఉంటారు. ఈ నేపథ్యంలో ఇల్లంద, కట్ర్యాల, నల్లబెల్లి, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మేడారానికి వివిధ వాహనాల ద్వారా వెళ్లిపోతున్నారు.

జ్ఞానసరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



పర్వతగిరిలో విగ్రహావిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పర్వతగిరి, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు దాతృత్వం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, హెచ్ఎం బి.రమేష్, పూర్వవిద్యార్థులు కరీంనగర్ జిల్లా కేశవపట్నం తహసీల్దార్ జోగినపెల్లి అనుపమ, పట్టాపురం ఏకాంతంగౌడ్, చీమల భిక్షపతి, రఘువీర్, శ్రీధర్, మధుపాల్ రావు, సత్యనారాయణ, కొము రయ్య, శోభారెడ్డి, లక్ష్మి, ఝాన్సీరెడ్డి, హైమావతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజును కలిసిన ఏసీపీలు



ఏసీపీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 19 : హనుమకొండ సుబేదారిలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హనుమకొండ ఏసీపీ మహేందర్‌రెడ్డి, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, ఏనుమాముల సీఐ పుల్యాల కిషన్‌లు ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు బొకే అందించారు.

● ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

పర్వతగిరి : నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్ సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హన్మకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, అత్తి రేవతికుమార్, సరోజనలచ్చునాయక్, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, మోహన్‌నాయక్, ఇనగంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



ఎల్లాయిగూడెంలో కట్టపై పనులను ప్రారంభిస్తున్న నాయకులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 19 : మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామంలో చెరువులు, కుంటల కట్టలకు ఇరువైపుల ఉన్న తుమ్మ, పిచ్చి మొక్కలను సోమవారం లోడి స్వచ్ఛంధ సంస్థ వారి ఆధ్వర్యంలో తొలిగించారు. స్వచ్ఛంద స్వంస్థ కో ఆర్డినేటర్ మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెరువులు, కుంటల కట్టలపై అల్లుక పోయిన ముల్ల పొదలు, సర్కారు తుమ్మలను, పిచ్చి మొక్కలను తొలంగించటం జరుగుతుందన్నారు. చెరువు కట్టలు దెబ్బతిన్న కుంట పనులను చేపట్టడం జరిగిందన్నారు. అలాగే పంట కాలువలను కూడా మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పొనుగంటి ప్రభాకర్, మంద సదానందం, మాజీ సర్పంచ్ మంద జయ, కందికొండ విజయ్, అల్వాల లక్ష్మీ, రవినాయక్, మురళి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



కళాశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 19 : నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం కళాశాల అడ్మిషన్ల ప్రక్రియ కోసం ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం కళాశాలను సందర్శించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమ్మక్క -సారలమ్మ జాతర కానుకగా చీరల పంపిణీ

రాయపర్తి, ఫిబ్రవరి 19 : మేడారం సమ్మక్క- సారలమ్మల జాతరను పురస్కరించుకుని పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు పేద మహిళలకు చీరలను కానుకగా పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో పలువురు మహిళలకు కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు గంజి విజయ్‌పాల్‌రెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వెళ్తున్న మహిళలు కొత్త చీరలు ధరించి వెళ్లి తల్లుల ఆశీర్వాదం పొందాలని ఝాన్సీరెడ్డి తలిచారని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, గ్రామపార్టీ అధ్యక్షుడు తీగల సాయిలు, మాజీ ఎంపీటీసీ సుతారి యాదగిరి, నారాయణ, గద్దం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.